

# అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఆదివారం 01 ఫిబ్రవరి 2026 | పేజీలు : 04


# అట్టహాసంగా శ్రీవాసవిమాత మండపం ఆవిష్కరణ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి టిజి భరత్

- రూ.60 లక్షలతో ఆర్యవైశ్యం సంఘం ఆధ్వర్యంలో మండపం ఏర్పాటు
- ప్రపంచంలో ఎక్కడా ఇటువంటి మండపం లేదు
- మంత్రి టిజి భరత్

**తాడిపత్రిఅర్బన్, జనవరి 31 ప్రభాతవార్త**

ప్రపంచంలో ఏ ప్రాంతంలోను వాసవిమాత మండపం రహదారి కూడళ్లలో లేదని ఆ అవకాశం తాడిపత్రి ఆర్యవైశ్యసంఘానికే దక్కుతుందని జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి టిజి భరత్ పేర్కొన్నారు. తాడిపత్రి పట్టణ సమీపంలోని కడప రోడ్డులోని ఐశ్వర్య విల్లాస్ సమీపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దాదాపు 60 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన శ్రీవాసవిమాత మండపాన్ని ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డితో కలిసి మంత్రి టిజి భరత్ ఆవిష్కరించారు. తాడిపత్రిని టెంపుల్ సిటీగా మార్చాలన్న మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆలోచన మేరకు అనంతపురం రోడ్డులో ధ్యాన శివుని విగ్రహం, బుగ్గ సమీపంలో సత్యసాయిబాబా సింబల్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. కడప రోడ్డులో వాసవిమాత మండపం ఏర్పాటుకు ఆర్యవైశ్యులు ముందుకు రావడంతో ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డిలు అనుమతులు మంజూరు చేయడం ఆర్యవైశ్య సంఘం దాతల సహకారంతో 32 అడుగుల మండపంలో 12 అడుగుల వాసవిమాత విగ్రహాన్ని ఏర్పాటు చేసి శనివారం ఘనంగా మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం మంత్రి టిజి భరత్ విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తాడిపత్రి మెయిన్‌రోడ్డు సర్కిల్‌లో వాసవిమాత మండపం ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డిలకు ఆర్యవైశ్య సంఘం సభ్యులు రుణపడి వుంటారన్నారు. ఈ ప్రాంతాన్ని వాసవి సర్కిల్‌గా నామకరణం చేయడం గర్వించతగ్గ విషయమన్నారు. 2019-24 మధ్యకాలంలో వైసిపి ప్రభుత్వం వ్యాపారస్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోకి కార్పోరేట్ వ్యాపార సంస్థలు పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపిస్తున్నాయని వాటి వల్ల స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలతో పాటు రాష్ట్ర ఆదాయం పెరుగుతుందన్నారు. అనంతపురం, బెంగళూరు పారిశ్రామిక క్యారిడార్‌ను ఏర్పాటు చేసి పరిశ్రమలు ఎక్కువగా ఏర్పాటు అయ్యేలా కూటమి ప్రభుత్వం రాయతీలు ప్రకటిస్తోందని, త్వరలోనే అనంతపురం జిల్లా పారిశ్రామిక హబ్‌గా మారుతుందని పేర్కొన్నారు. తాడిపత్రిలో ఇలాంటి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆర్యవైశ్యులకు గర్వకారణమన్నారు. ఆర్యవైశ్యులు రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వానికి కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వానికి దాదాపు 90 నుండి 95 శాతం మద్దతు ప్రకటించడం వల్లే అధికారంలోకి రావడం జరిగిందని మంత్రి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తలుపుల సురేంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి అశ్వర్థరంగయ్య, ఉపాధ్యక్షులు రాజా, సంయుక్త కార్యదర్శి భూమా సుబ్రమణ్యం, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ, ఇళ్ళూరు లక్ష్మయ్య, రాష్ట్ర యువజన అధ్యక్షులు శబరి వరప్రసాద్, రాష్ట్ర పొలిటికల్ చైర్మన్ కోటా సత్యనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ భూమా నాగరాగిణి, భువనాసు వాసు, సిరుగుప్ప వెంకటేష్, సుధాకర్‌గుప్తా, వంకదారి రాజా, అరవింద, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



హాజరైన ప్రజలు

# జగన్ పార్టీకి జనం ఎప్పుడో పాడి కట్టేశారు..!

- బడుగు, బలహీన వర్గాల మనోభావాలతో ఆడుకున్న వ్యక్తి జగన్ రెడ్డి
- పాదయాత్ర కాదు పొర్లు దండాలు పెట్టిన జగన్ అధికారంలోకి రాలేదు
- పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత
- గోరంట్ల మండలం వడిగేపల్లి పంచాయతీలో అభివృద్ధి పనుల్లో మంత్రి సవితమ్మ.









సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి, కలెక్టర్లు, గ్యాస్ సిలిండర్ల పంపిణీ చేస్తున్న మంత్రి సవితమ్మ

**గోరంట్ల జనవరి 31ప్రభాతవార్త**

జగన్ హయాంలో అన్నీ కల్తీలే బలహీన వర్గాల మనోభావాలతో ఆడుకున్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని మంత్రి సవిత విమర్శించారు.శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్లలో నిర్వహించిన సామాజిక భద్రత పింఛన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి గంధం చంద్రుడు, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. గ్రామంలో 15 లక్షల రూపాయలతో సిసి రోడ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు అనంతరం 119 ఇంటి పట్టాలను పంపిణీ చేసి, ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు.మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 63 లక్షల మందికి రూ.2717 కోట్లు, జిల్లా వ్యాప్తంగా 2,63,000 మందికి రూ.115 కోట్లు, నియోజకవర్గ వ్యాప్తంగా 40,000 మందికి రూ.17 కోట్లు, గోరంట్ల మండలంలో 11,000 మందికి రూ.4.29 కోట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వడిగేపల్లి పంచాయతీలో 462 మందికి సుమారు రూ.20 లక్షలు పింఛన్ల రూపంలో అందజేస్తున్నామని చెప్పారు.అదేవిధంగా వడిగేపల్లి పంచాయతీ లో ఇప్పటికే రూ.50 లక్షలతో ట్యాంకు, రూ.43 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని, రూ.21 లక్షలతో సిరి కల్చర్, గోకులం షెడ్ల నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు.దీపం-2 పథకం కింద 1240 మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశామని చెప్పారు.అన్నదాత సుఖీభవ పథకం కింద 529 మంది రైతుల ఖాతాల్లో దాదాపు రూ.27 లక్షలు జమ చేశామని, తల్లికి వందనం పథకం కింద పంచాయతీలోని 268 మంది విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో రూ.47 లక్షలు జమ చేశామని తెలిపారు. త్వరలో రూ.31 లక్షలతో గ్రామ ఆరోగ్య కేంద్రం నిర్మిస్తామని వెల్లడించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ , రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలతో జగన్ అలజడులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఆయన ఎన్ని ప్రయత్నాలు చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధిలో దూసుకుపోతున్నారని అన్నారు. కల్తీ గురించి జగన్ మాట్లాడడం విడ్డూరమని, ఏ విషయంలో ఆయన కల్తీ చేయలేదో చెప్పాలని నిలదీశారు.జగన్ తన ఉనికికోసం, చిల్లర రాజకీయాల కోసం కులాల మధ్య చిచ్చు పెట్టే శవ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ పాదయాత్రకు వస్తే ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.జగన్మోహన్ రెడ్డి పాలనాలో ప్రతి విషయంలోను కల్తీ జరిగిందని బడుగు బలహీన వర్గాల మనోభావాలు ఆడుకున్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డిని జగన్ రెడ్డి పాదయాత్ర కాదు ,పొర్లు దండాలు పెట్టిన అధికారంలోకి రాలేరని మంత్రి సవిత విమర్శించారు. గత 19 నెలల్లో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి ప్రజలకు స్పష్టంగా తెలుసని, చంద్రబాబు నాయుడు అపర భగీరథుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఇంచార్జ్ కలెక్టర్ గంధం చంద్రుడు, టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తిరుపాల్,పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి నరేష్, సర్పంచ్ నరసింహమూర్తి, నిమ్మల శ్రీధర్, నాగే నాయక్, అచ్యుత్ నాయుడు, సింగిల్విండ్ అధ్యక్షులు బెల్లాలచెరువు చంద్ర రవి మోహన్ మార్కెట్ డైరెక్టర్ రవీంద్ర నాయక్, సుబ్బారెడ్డి, నారా లోకేష్ యువతరం వ్యవస్థాపకులు పచ్చ అశోక్, పసుపులేటి శ్రీనివాసులు, మల్లాపల్లి మహమ్మద్, వెంకటరెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, గిరిధర్ గౌడ్, అజంతుల్లా, ఉమా శంకర్, జనసేన సురేష్, కురుమాల జయరాం, లక్ష్మీపతి, రెడ్డి చెరువు కట్ట నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# 100 ఏళ్ళ చరిత్రలో ఇది అఖండ బడ్జెట్

: మున్సిపల్ చైర్మన్

- 375 కోట్లతో మున్సిపల్ బడ్జెట్ ఆమోదం - అప్పుల భారం వద్దని వైసిపి వాకౌట్



మాట్లాడుతున్న చైర్మన్, కమిషనర్

**హిందూపురం జనవరి 31 ప్రభాతవార్త**

100 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన హిందూపురం మున్సిపాలిటీలో అత్యధికంగా ఈసారి రూ. 375 కోట్లతో మున్సిపల్ బడ్జెట్ రూపొందించడం చారిత్రాత్మకం అని.. అందుకే ఇది అఖండ బడ్జెట్ మున్సిపల్ చైర్ పర్సన్ డిఇ రమేష్ కుమార్ అభివర్ణించారు. 2026 27 ఆర్థిక సంవత్సరానికి గాను మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం చైర్మన్ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో శనివారం జరిగింది. హిందూపురం మున్సిపల్ చరిత్రలో సరికొత్త రికార్డు 375 కోట్లతో రూపొందించిన భారీ బడ్జెట్ ఆమోదించారు. 202526 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ దాదాపు 86 కోట్లతో ప్రవేశపెట్టగా 202627 కు 375 కోట్లతో ప్రవేశ పెట్టారు. అమృత్2 పథకం కింద చేపట్టనున్న పథకానికి కేంద్ర ప్రభుత్వం నుంచి 75 శాతం నిధులు వచ్చాయా లేక అప్పు చేస్తున్నారా అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు వెంకట నాగేంద్రబాబు తో పాటు వైస్ చైర్మన్ బలరాం రెడ్డి, కౌన్సిల్ విపక్ష నాయకులు ఆసిఫ్ తదితరులు ప్రశ్నించారు. ఇప్పటికే గొల్లపల్లి వీటి ప్రాజెక్టు కోసం చేసిన అప్పు మున్సిపాలిటీ తలపై మోయలేని భారంగా ఉందని 80 లక్షల రూపాయలు వడ్డీ కడుతున్నామని అన్నారు. చైర్మన్, కమిషనర్ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. అమృత్ పథకానికి గ్రాంట్ మాత్రమేనని అప్పు కాదని చెప్పారు. రికార్డుల్లో వేరుగా చూపించారు కదా అని వైసిపి సభ్యులు మరల ప్రశ్నించడంతో కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది తెలుగుదేశం పార్టీ తరపున కౌన్సిలర్ రాఘవేంద్ర ఒక్కరే వైసిపి పై ఎదురు దాడి చేశారు. మిగిలిన ఆ పార్టీ కౌన్సిలర్లు అందరూ తమకేమీ సంబంధం లేనట్టుగా మౌనంగా ఉండి పోయారు. వైసిపి కౌన్సిలర్లు చేతుల్లో ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేస్తూ కౌన్సిల్ నుంచి వెళ్లిపోయారు. రహదారులు, నీటి సరఫరా, డ్రైనేజీలు నిర్వహణ, వీధిలైట్లు మొదలగు అంశాలకు నిధులను ఖర్చు చేయనున్నట్లు బడ్జెట్లో చూపించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అడ్డదిడ్డంగా మాట్లాడి ఇంత భారీ బడ్జెట్ చూసి ఓర్వలేక కౌన్సిల్ నుంచి వైసీపీ కౌన్సిలర్లు వెళ్లిపోయారన్నారు. బడ్జెట్ సమావేశం అనంతరం ప్రత్యేక సమావేశం జరిగింది. 19 అంశాలలో ప్రధానంగా పలు అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్లు ఆమోదం తెలిపారు. పుర ప్రజల భవిష్యత్తు ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని తెలుగు తల్లి రహదారి నుండి మేలాపురం, ముద్దిరెడ్డిపల్లి, సింగిరెడ్డిపల్లి మీదుగా హైవేకి చేరుకునే రోడ్డుకు 100 అడుగులు తో విస్తరించాలని నిర్ణయాన్ని కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అలాగే పట్టణ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలో భాగంగా పొట్టి శ్రీరాములు చిన్న మార్కెట్ సర్కిల్ నుండి వాల్మీకి సర్కిల్ వరకు 100 అడుగులతో రోడ్డు విస్తరణ చేయాలని కౌన్సిల్ తీర్మానం చేసింది.



అప్పులు చేయరాదని వైసిపి నిరసన దృశ్యం

# అంబటి రాంబాబు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా టీడీపీ ఆందోళన

- అంబటిని అరెస్టు చేయాలని పోలీసులకు ఫిర్యాదు - ఎమ్మెల్యే సురేంద్రబాబు ఘాటు విమర్శలు

**కళ్యాణదుర్గం, జనవరి 31 ప్రభాతవార్త**

వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా టీడీపీ మహిళా నేతలు, నాయకులు శుక్రవారం టీ సర్కిల్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు దిష్టిబొమ్మను ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. కొందరు మహిళా నేతలు దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టగా, అనంతరం దానిని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ, నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా సేవలందించిన నారా చంద్రబాబు నాయుడుపై, అలాగే ఆయన కుటుంబ సభ్యులను ఉద్దేశించి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అంబటి రాంబాబు మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న రాజకీయంలో ఎంతో ఎత్తుకు ఎదిగిన చంద్రబాబు నాయుడును విమర్శించడం తగదని, వారిని రాష్ట్ర బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. తమ అభిమాన నాయకున్ని పల్లెత్తు మాటన్నా సహించే ప్రసక్తే లేదని, తప్పకుండా చర్యలు తీసుకుంటా మన్నారు. రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమని, కానీ వ్యక్తిగత దూషణలు, కుటుంబాలను లాగుతూ మాట్లాడటం అనాగరికతకు నిదర్శనమని పేర్కొన్నారు. తిరుమల లడ్డు కల్తీ వ్యవహారంపై జరుగుతున్న చర్చను పక్కదారి పట్టించేందుకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపించారు. వైసీపీ నేతలు నోటికి అదుపు లేకుండా మాట్లాడుతున్నారని, ఇది రాజకీయ సంస్కృతిని దిగజారుస్తోందని విమర్శించారు. అంబటి రాంబాబుపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో టీడీపీ మహిళా నేతలు, టిడిపి నాయకులు, న్యాయవాదులు ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి హోదాలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని వారు అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, హద్దులు దాటిన వ్యాఖ్యలను ఇకపై సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోయ లక్ష్మీదేవి, మున్సిపల్ చైర్మన్ తలారి గౌతమి, మహిళా కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, మండల కన్వీనర్ వెంకటేశులు, పార్లమెంట్ కమిటీ కార్యదర్శి షామీర్, పెద్దతులు వచ్చిన టిడిపి నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

**బ్రహ్మసముద్రంలో :** బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అంబటి రాంబాబు దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడుగా చంద్రబాబు నాయుడు ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారని అలాంటి నేతను దూషించిన అంబటి రాంబాబు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అంబటి రాంబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న ఎమ్మెల్యే టిడిపి నేతలు

# విద్యార్థులకు క్రీడలతో ఆరోగ్యం మానసిక ప్రశాంతత

- ఇండోర్ స్టేడియం రావడం ఈ ప్రాంత వాసులకు చిరకాల కోరిక
- రూ.2కోట్ల 10 లక్షలతో స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



ఇండోర్ స్టేడియం శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె, తెదేప నాయకుల దృశ్యం

**కొత్త చెరువు, జనవరి 31 ప్రభాతవార్త**

విద్యార్థులకు క్రీడలతో ఆరోగ్యం మానసిక ప్రశాంతత కలుగుతుందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. కొత్తచెరువు మండల కేంద్రంలోని విద్యా ప్రాంగణంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను శనివారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, 2018లో అప్పటి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు,ఈ ప్రాంత ఎమ్మెల్యే అప్పటి మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక చొరవ తో కోటి రూపాయలతో కొత్తచెరువుకు ఇండోర్ స్టేడియం మంజూర అయిందని తెలిపారు. అయితే ఎన్నికలు రావడం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు అలాగే ఆగిపోయాయని గుర్తు చేశారు. కొత్తచెరువు మండల కేంద్రంలోని ఈ విద్యా ప్రాంగణంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి రెండు కోట్ల పదిలక్షల 50 వేల రూపాయలు నిధుల మంజూరుకు చర్యలు తీసుకున్నారని అందుకు సీఎం చంద్రబాబు గారికి ,విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు కు ,రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఇండోర్ స్టేడియం కొత్తచెరువు గ్రామం ఈ ప్రాంత వాసుల చిరకాల కోరిక అని అన్నారు. ఈ స్టేడియం రాకతో క్రీడాకారులకు ఎంత ఉపయోగకరమని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ఇండోర్ స్టేడియం ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరికి విద్యతోపాటు క్రీడలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడల వల్ల మానసిక ప్రశాంతతతో పాటు మనిషికి ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. నేటి పరిస్థితుల్లో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అర్జున , ఖేల్ రత్న ,పద్మశ్రీ ,ద్రోణచార్య వంటి అవార్డులు అందజేస్తోందని గుర్తు చేశారు. ప్రభుత్వం కూడా క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ఉద్యోగ రంగంలో విద్యారంగంలో నాలుగు శాతం రిజర్వేషన్ అందజేస్తుందని తెలిపారు. కొత్త చెరువులో ఇండోర్ స్టేడియం రావడం ఈ ప్రాంత క్రీడాకారులు చేసుకున్న అదృష్టమన్నారు. అదేవిధంగా కొత్తచెరువు సత్యసాయి జిల్లా పుట్టపర్తికి నడి కేంద్రంగా ఉండడంవల్ల రోడ్లు విస్తరణ తో పాటు ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కొత్తచెరువు మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కళాశాలలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సిబ్బందికి సూచించారు. కొత్తచెరువు పట్టణాన్ని అత్యంత పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ అధికారులకు సూచించారు. అదేవిధంగా ఈ ప్రజల చిరకాల కోరిక స్మశాన వాటిక ను అన్ని వసతులతో ఏర్పాటు చేశామని దీనికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక చొరవతో సాధ్యమైందన్నారు. ఈ స్టేడియం నిర్మాణ పనులను ఎంతో నాణ్యంగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండ్ కోసం స్థలమిచ్చిన దాతలను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ను ఉపయోగించుకొనేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని తెలిపారు. అనంతరం కొత్తచెరువు చెందిన హజరత్ సయ్యద్ షా మస్తాన్వలి గారి 123 ఉరుసు మహోత్సవ పోస్టర్ను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ,ఆర్డీఓ సువర్ణ చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో దర్గా ముతవల్లి మాజీ సర్పంచ్ మాణిక్యం బాబా, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు, శ్రీశైలం ఆలయ కమిటీ సభ్యులు మాజీ జెడ్పిటిసి లక్ష్మీనారాయణ, సామకోటి ఆదినారాయణ, కొత్త చెరువు మండల టీడీపీ కన్వీనర్ రామకృష్ణ ,టీడీపీ యువ నాయకులు చిన్న పొల్ల సంతోష్ కుమార్ , శాప్ జిల్లా అధికారి కిషోర్ ,కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ ,శివారెడ్డి ,విశ్రాంత ఉపాధ్యాయులు సూర్యనారాయణ వెంకన్న, స్థల దాత పార్వతీ ,రాజీవ్ , సింగల్ విండో అధ్యక్షులు నాగేంద్రప్రసాద్ మాజీ సర్పంచ్ మాణిక్యం బాబా తహసిల్దార్ రామాంజనేయులు ఎంపీడీవో నటరాజ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ,కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# దత్త క్రియాయోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి వెల్లడి
- జయలక్ష్మిపురం బొమ్మపర్తిలో ముగిసిన దత్త క్రియ యోగ తరగతులు





భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న దత్త పీఠం పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ



రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దత్తక్రియ తరగతులకు హాజరైన శిక్షకులు

**అనంతపురం, జనవరి 31, (ప్రభాతవార్త బ్యూరో)**

ఆధునిక ప్రపంచంలో ప్రజలందరూ క్షేమంగాఆరోగ్యంగా ఉండాలంటే దత్త క్రియ యోగ చేయడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి మనిషి ప్రతిరోజు ప్రతినిత్యం యోగా సాధన ద్వారా మంచి జరుగుతుందని ఆరోగ్యంగా ఉంటారని అలా జరగాలన్న లక్ష్యంతోనే దత్త పీఠం ఆధ్వర్యంలో జయలక్ష్మి పురంలో దత్త క్రియాయోగ తరగతులను నిర్వహించడం జరిగిందని దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు .తల్లికి మించిన దైవం లేదని తాను జయలక్ష్మి మాత ఆశీర్వాదం వల్లనే ఆమె అద్భుతమైన శివ భక్తురాలు కావడం వల్ల ఆ మహిమలతో తనకు ఈ శక్తి లభించిందని అమ్మవారిని స్వామీజీ గుర్తు చేసుకున్నారు.తన శక్తి అంతా తన తల్లి జయలక్ష్మి మాతాదే అని అన్నారు.రాప్తాడు మండలం బొమ్మపర్తి జయలక్ష్మి పురం గ్రామంలో దత్త పీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న దత్త క్రియాయోగ తరగతులు ముగింపు సమావేశం శనివారం జరిగింది .ఈ సమావేశంలో మైసూర్ దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ, దత్తపీఠం ఉత్తరాధికారి శ్రీ విజయానంద తీర్థ స్వామీజీ పాల్గొన్నారు .ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ప్రపంచ శాంతి ఆరోగ్యం కొరకు గత 40 సంవత్సరాలకు పైగా దత్త పీఠం ఆధ్వర్యంలో దత్తక్రియ యోగా తరగతులను నిర్వహించడం జరుగుతున్నదని అందులో భాగంగా ఈ ఏడాది జయలక్ష్మి పురంలో నిర్వహించడం జరుగుతుందని ఇందులో తెలుగు రాష్ట్రాల్లో ఉన్నటువంటి అనేకమంది దత్తక్రియ యోగా తరగతుల్లో పాల్గొన్నారు అని స్వామీజీ తెలిపారు .ఇందులో ట్రైనింగ్ తీసుకున్నవారు ఆయా జిల్లాలలో ఆయా ప్రాంతాలలో నిత్యం దత్తక్రియ యోగా తరగతులు నిర్వహిస్తూ ప్రజల్ని పెద్ద ఎత్తున ఆరోగ్యవంతులు చేయడానికి యోగా తరగతులు నిర్వహించాలన్నదే దత్త పీఠం లక్ష్యమని అందుకోసమే తరగతులు నిర్వహించామని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. దత్త పీఠం ఆధ్వర్యంలో జయలక్ష్మి పురం అనంతపురం జిల్లాను సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గత రెండు రోజులు క్రితం దాదాపుగా 40 ఎకరాల్లో ఆయుర్వేదిక్ మొక్కలను నాటడం జరిగిందని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మానవులందరికీ మంచి చేయాలన్న లక్ష్యంతో ఆధ్యాత్మిక చింతన వైపు తీసుకురావాలన్న లక్ష్యంతో దత్త పీఠం పనిచేస్తుందని అన్ని వర్గాల ప్రజలు క్షేమం కోసం రైతుల క్షేమం కోసం యాగాలు పూజలు నిత్యం నిర్వహిస్తానే ఉంటామని అమ్మ జయలక్ష్మి పురం లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని శ్రీ స్వామీజీ అన్నారు .దత్త క్రియా తరగతులు మూడు రోజులు ముగిసిన సందర్భంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికి దత్తపీఠం ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. అనంతరం స్వామీజీ దత్త క్రియాయోగ తరగతుల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.కాగా జయలక్ష్మి మాత ఆరాధన ఉత్సవాలు రాప్తాడు మండలం బొమ్మపర్తి జయలక్ష్మి పురం లో ఆదివారం నిర్వహించిన తర్వాత దత్త పీఠం పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి ఇక్కడి నుంచి మైసూర్ కి వెళ్ళిపోతారని, ఆదివారం రోజు పేద ప్రజలకు అన్నదానము, వస్త్రధానము అమ్మ జయలక్ష్మి మాత పేరు మీద ప్రతి ఏడాది నిర్వహిస్తున్న విధంగానే ఈ ఏడాది నిర్వహిస్తారని నిర్వాహకులు చెబుతున్నారు.ఆదివారం ఉదయం జయలక్ష్మి మాత ఆరాధన ఉత్సవాలు, సాయంత్రం రథయాత్ర ఉంటుంది. జయలక్ష్మి మాత తిప్పోత్సవం కార్యక్రమం మొదటిసారిగా బొమ్మ పరిధిలో ప్రారంభిస్తున్నారు.

02ATP27_02ATP27.qxd 31-01-2026 PM 10:36 Page 1



## దేవుడి ప్రసాదంపై రాజకీయం తగదు...

### కూటమి ప్రభుత్వానివి అధారాల్లేని ఆరోపణలు



పూజల్లో దీపిక, వేణురెడ్డి.

**హిందూపురం టౌన్ జనవరి 31 ప్రభాతవార్త**

ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీవారి ప్రసాదం పై కూటమి ప్రభుత్వం రాజకీయం చేయడం తగదని వైఎస్ఆర్సిపి నాయకులు దీపిక, వేణురెడ్డి అన్నారు. వైయస్సార్సీపి పార్టీ పిలుపుమేరకు శనివారం హిందూపురం పట్టణంలోని శ్రీ పేట వెంకటరమణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



మీడియాతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు.

నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దీపిక వేణురెడ్డిలు మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి ప్రభుత్వం తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని కలుషితం చేసిందని ఆరోపించిన తరుణంలో ఇటీవల సిబిఐ తిరుమల శ్రీవారి ప్రసాదంలో ఎలాంటి కల్తీ జరగలేదని చార్జి సీటు దాఖలు చేసింది అని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పై బురదజల్లే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుందని అందులో భాగంగానే శ్రీవారి ప్రసాదాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వైయస్సార్సీపిపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. సిబిఐ కల్తీ జరగలేదని నిరూపించడంతో కూటమి నాయకులకు గట్టి షాక్ తగిలిందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నిత్యం ప్రజల కోసం తపించే వ్యక్తిని జగన్మోహన్ రెడ్డి దేవుడి విషయంలో ఎలా తప్పు చేస్తాడని అన్నారు. జగన్మోహన్ రెడ్డి వైసీపీపై దుష్ప్రచారాలను ఆపి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో వైయస్సార్సీపి నాయకుడు బాలాజీ మనోహర్, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చౌలూరు మధుమతి, పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పట్టుదల ముందు పరిమితులు ఓటమి కళ్యాణదుర్గం యువతికి బంగారు విజయం

**కళ్యాణదుర్గం, జనవరి 31 ప్రభాతవార్త**



బంగారు పథకాలతో తండ్రితో సంతోషాన్ని పంచుకుంటున్న క్రీడాకారిణి సహనా

శారీరక పరిమితులు సంకల్పశక్తి ముందు నిలవలేవని మరోసారి నిరూపించింది కళ్యాణదుర్గం మండలం వర్లి గ్రామానికి చెందిన కురుబ సహనా. వికలాంగురాలైన (మరుగుజ్జు) సహనా తనలోని పట్టుదల, ఆత్మవిశ్వాసంతో క్రీడా రంగంలో అరుదైన విజయాన్ని సొంతం చేసుకుని ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. అంతర్రాష్ట్ర స్థాయి గేమ్స్‌లో భాగంగా గుజరాత్ రాష్ట్రంలో నిర్వహించిన షాట్‌పుట్, డిస్కస్ త్రో పోటీల్లో ఆమె అద్భుత ప్రతిభ కనబరిచి రెండు విభాగాల్లో మొదటి స్థానాలు సాధించి రెండు బంగారు పతకాలు గెలుచు కుంది. ప్రతికూల పరిస్థితులను లెక్కచేయకుండా కఠోర సాధనతో ఈ ఘనత సాధించడం ప్రత్యేక ప్రశంసనీయమని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. వికలాంగత్వాన్ని అడ్డంకిగా కాకుండా సవాలుగా మలచుకుని ముందుకు సాగుతున్న సహనా విజయయాత్ర నేటి యువతకు, ముఖ్యంగా ప్రత్యేక అవసరాలున్న క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తోంది. ఆమె ప్రదర్శనను గమనించిన క్రీడా నిపుణులు, భవిష్యత్తులో పెరాలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశాలు మెండుగా ఉన్నాయని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణదుర్గం ప్రాంతానికి మంచి పేరు తీసుకొచ్చిన కురుబ సహనాకు అన్ని వర్గాల ప్రజలు, క్రీడాభిమానులు, స్థానికులు హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నారు.

## అంబటిరాంబాబును అరెస్టు చేసి శిక్షించాలి

### చంద్రబాబుకు అంబటి రాంబాబు క్షమాపణ చెప్పాలి.

### అంబటి రాంబాబుదిష్టిబొమ్మ దహనం

**ధర్మవరంటౌన్, జనవరి 31 ప్రభాతవార్త**



అంబటిరాంబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీనాయకులు

రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుపై అసభ్యపదజాలంతో దూషించిన వైసీపీ నాయకుడుఅంబటి రాంబాబును తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కళాజ్యోతిసర్కిల్లో శనివారం అంబటిరాంబాబు దిష్టిబొమ్మను దహనంచేశారు. అంతకుమునుపు ప్రదాన కూడళ్లలోబారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వన్ టౌన్ పోలీసుస్టేషన్ లో లిఖితపూర్వకంగా పిర్యాదు చేస్తూ అంబటి రాంబాబును అరెస్టుచేయాలని పోలీసులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దూషణల పర్వమే తిరిగి కొనసాగించాలని చూస్తున్నారని ఎట్టి పరిస్థితుల్లో ప్రజాప్రభుత్వంలో ఇదికొనసాగదని అంబటిరాంబాబును టీడీపీనాయకులు హెచ్చరించారు. అంబటి రాంబాబుఒళ్లు దగ్గరపెట్టుకుని మలుసుకోవాలని లేదంటే రాష్ట్రం నుంచి టీడీపీ శ్రేణులే తరిమితరిమి కొడతారని హెచ్చరించారు. వెంటనే అంబటిరాంబాబు చంద్రబాబునాయుడుకు బేషరతుగా క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పరిశేసుధాకర్, రాళ్లపల్లిషరీఫ్, పురుషోత్తంగౌడ్, కేశగాళ్లశీన, తలారిచంద్రమోహన్, బొట్టుకిష్ట జింకలరాజన్న, అంగజాల చిన్న వీరప్ప, అనిల్, టైలర్ గోపాల్, కరెంటు ఆది వరదరాజులు, మాబుసాబ్, చట్టా లక్ష్మీనారాయణ, లెజెండ్ తోటనారాయణస్వామి, అత్తరహీం, రావులచెరువు కుళ్లాయప్ప, రామకృష్ణ, రావులచెరువు కులాయప్ప, తొగట అనిల్, వంటరమేశ్, ఇర్షాద్, కిరోసిన్ పోతలయ్య, ఆటోవళి, తెలుగుమహిళలు బీబీ, వెంకటలక్ష్మి, మాలతి, తదితరులు పాల్గొన్నారు.

## పండుగ వాతావరణంలా రేనాటి వీరుడు వడ్డే ఓబన్న విగ్రహా ఆవిష్కరణ ఎమ్మెల్యే అమిలినేని..

### ఎమ్మెల్యేకు టీడీపీ నాయకులకు మహిళలు కలశాలతో, గ్రామస్థులు పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు.

**శెట్టూరు, జనవరి 31 ప్రభాతవార్త**



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని.

ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి అనుచరుడు, రేనాటి విప్లవ వీరుడు వడ్డే ఓబన్న అని అలాంటి వీరుడి విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. శెట్టూరు మండలం చిన్నంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన రేనాటి యోధుడు వడ్డే ఓబన్న విగ్రహా ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు టీడీపీ నాయకులు పాల్గొనగ గ్రామంలోని మహిళలు కలశాలతో ఘన స్వాగతం పలికగా గ్రామంలో ఊరేగింపుగా ఓబన్న విగ్రహం వరకు వెళ్లి కలశాలు సమర్పించగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

## కమనీయం శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం

### గోవింద నామంతో మార్మోగిన విప్రమలై కొండలు

### భారీ సంఖ్యలో హాజరైన భక్తులు



నరసింహ స్వామి కళ్యాణ ఉత్సవ దృశ్యాలు

**రాయదుర్గం జనవరి 31 ప్రభాతవార్త**

రాయదుర్గం మండలం మల్లాపురం గ్రామంలో వెలిసిన శ్రీ విప్ర మలై లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం అత్యంత కమనీయంగా జరిగింది ఈ సందర్భంగా ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు శ్రీ రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం స్వామి వేద పండితులు శ్రీ లక్ష్మీసమేత నరసింహ స్వామికి సుప్రభాత సేవ నిత్యారాధన పుష్పాలంకరణ నైవేద్య పూజలు గావించారు. అనంతరం 11 గంటల 15 నిమిషాల నుండి 11:45 వరకు శ్రీవారి కల్యాణోత్సవం వేద పండితులు వేదమంత్రోచరణతో సన్నాయి మేళాలు వాయిస్తుండగా అత్యంత కమనీయంగా కళ్యాణం జరిగింది ఉచిత వివాహాలకు దాతలు పేర్మికి కుటుంబ సభ్యులు దండే విశ్వరాజు సుశీలమ్మ కే సత్యనారాయణ దొబ్బెడి మంజుల వెంకటేశులు సురేష్ గార్మెంట్స్ వారి సహకారంతో ఉచిత కళ్యాణ ఉచిత సామూహిక వివాహాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బి.ఎన్.టి. తిప్పేస్వామి ఉపాధ్యక్షుడు ధర్మన్న కోశాధికారి జిఎం నరసింహులు ఉప కోశాధికారి జి సత్యనారాయణ కార్యదర్శి జి గురు రాఘవేంద్రప్రసాద్ అకౌంటెంట్ శ్రీ వెంకటేశులు ప్రచార కార్యదర్శి కమలాక్షుడు కమిటీ సభ్యులు చిన్న తిప్పే స్వామి ఆనంద్ రెడ్డి రామరెడ్డి గుర్నాథ్ రెడ్డి వెంకట్ రెడ్డి గోపాల్ రెడ్డి కరెంటు నరసింహులు తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు

## మారెమ్మ జాతరకు ఎమ్మెల్యే సురేంద్ర బాబును ఆహ్వానించిన తెదేపా నాయకులు

**బ్రహ్మసముద్రం జనవరి 31 ప్రభాతవార్త**



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రం అందిస్తున్న దృశ్యం

మండలంలోని సంతే కొండాపురం గ్రామంలో మారెమ్మ జాతర మహోత్సవం సందర్భంగా ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ వేడుకను తిలకించడానికి ఎమ్మెల్యే సురేంద్ర బాబు టీడీపీ బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములును సర్పంచ్ వనిత మల్లికార్జున సింగిల్ విండో అధ్యక్షులు అంకె ఓబులేష్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి జాతర ఆహ్వాన పత్రికలను అందజేశారు సంతే కొండాపురం గ్రామ అభివృద్ధికి జాతర విజయవంతానికి పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది ఫిబ్రవరి 4,5,6న జరిగే ఈజాతరకోసం గ్రామస్థులు భారీ ఎత్తునఏర్పాట్లను సిద్ధమవుతున్నారు. ఎలాంటి కొరత లేకుండా పారిశుధ్యం, భక్తులకు కనీస వసతులు మరియు భద్రతపై సర్పంచ్ పర్యవేక్షిస్తున్నారు. స్థానిక నేతలు, యువకులు మరియు పెద్దలు సమన్వయంతో పని చేస్తూ ఈ వేడుకను రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చేలా నిర్వహించాలని సంకల్పించారు. ఈ పర్యటనతో గ్రామంలో రాజకీయంగా మరియు ఆధ్యాత్మికంగా ఉత్సాహం పెరిగింది. ఈ ఆహ్వాన కార్యక్రమంలో బూత్ కన్వీనర్ నరసింహ, డీలర్ చనమల్ల, యూనిట్ ఇంచార్జ్ ఎర్రిస్వామి, మాజీ డీలర్ వెంకటేశులు, నవీన్, తిమ్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరి - కనేకల్‌లో బైక్ ర్యాలీలో సీఐ వెంకటరమణ సూచన

**కనేకల్, జనవరి 31 ప్రభాతవార్త**

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు సందర్భంగా కనేకల్ పట్టణంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని రాయదుర్గం సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించగా, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు. కనేకల్ పోలీస్ స్టేషన్ నుంచి చిన్నపరెడ్డి సర్కిల్ వరకు మెకానిక్ యూనియన్ సభ్యులు, స్థానికులు పాల్గొంటూ బైక్ ర్యాలీ సాగింది. ర్యాలీ సందర్భంగా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరమణమాట్లాడుతూద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలన్నారు . హెల్మెట్ లేకుండా ప్రయాణించడం ప్రమాదాల సమయంలో వాహనదారుడికే కాకుండా అతని కుటుంబానికి కూడా తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని హెచ్చరించారు. వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న ప్రయాణికుడు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. రోడ్డు నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణతో వాహనాలు నడపాలని ఆయన సూచించారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న వారితో రోడ్డు భద్రతపై ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ ర్యాలీలో కనేకల్ పోలీసు సిబ్బంది, మెకానిక్ యూనియన్ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హెల్మెట్లను పంపిణీ చేసిన సబ్ ఇన్స్‌పెక్టర్ శివ

**బెలుగుప్ప, జనవరి 31 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శివ ద్విచక్ర వాహనాలు నడిపే వాలెంటీర్లకు హెల్మెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్లు ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని, రోడ్డు భద్రత వారోత్సవాల్లో తెలిపారు. అందులో భాగంగా ఆటో, టాక్సీలు నడిపేవారికి ప్రతిఒక్కరు యూనిఫాంధరించాలని తెలిపారు. అధికసంఖ్యలో ప్యాసింజర్లను వేయకుండా ఎన్ని సీట్లు ఉంటే అన్నే భర్తీ చేయాలని తెలిపారు. హెల్మెట్లు లేకుండా ప్రయాణించకూడదని తెలిపారు. ప్లెక్సీలను, పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వాలెంటీర్లకు హెల్మెట్లను ఇస్తున్న దృశ్యం

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**గుంతకల్లు, జనవరి 31 ప్రభాతవార్త**



పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు పట్టణంలోని 26వ వార్డు బీరప్ప సర్కిల్ ప్రాంతంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం శనివారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు సకాలంలో అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 3 వేలు ఉన్న పెన్షన్లను ఒకేసారి 4 వేలకు పెంచి ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతకై ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, డాక్టర్ సెల్ అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు, నాయకులు తలారి మస్తానప్ప, గుమ్మనూరు వెంకటేష్, ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే :**

ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రి హైదరాబాద్ వారి సౌజన్యంతో 5వ రోజు శనివారం పట్టణంలోని పరిటాల రవి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత మేగా కంటి వైద్య శిబిరంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పాల్గొన్నారు. ఉచిత కంటి శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రధానంగా కళ్ళను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత అవగాహనపై బైక్ ర్యాలీ

**డి.హిరెహాళ్ జనవరి 31 ప్రభాతవార్త**



రోడ్డు భద్రతపై బైక్ ర్యాలీ నిర్వహించిన పోలీసులు



వాహనదారులకు హెల్మెట్ పంపిణీ చేస్తున్న సీఐ వెంకటరమణ

రోడ్డు ప్రమాదాల నివారణ తో ప్రమాదాల సంఖ్య తగ్గించేందుకు రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించినట్లు సీఐ వెంకటరమణ తెలిపారు. శనివారం డి.హిరెహాళ్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ ఐ గురుప్రసాద్ రెడ్డితో కలిసి రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించి వాహన చోదకులకు, ప్రజలకు భద్రత విషయాలను వివరించారు. పోలీసు సిబ్బంది, వాహనాల చోధకులు, మండల కేంద్రంలోని ప్రజలను సమావేశపరిచి మోటార్ సైకిల్ వాహనచోదకులు డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ ధరించకపోతే ప్రమాద సమయంలో ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంటుందని సిఐ తెలిపారు. నాలుగు చక్రాల వాహనదారులు డ్రైవింగ్ సమయంలో అనుకోని సంఘటనలు సంభవిస్తే ప్రమాదం నుండి తమను తాము కాపాడుకోవచ్చని వారు సూచించారు. డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో రహదారి సూత్రాలను పాటిస్తూ వాహనాలు నడపాలని సీఐ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రధాన రహదారులపై పోలీసు సిబ్బంది, వాహన చోదకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి రహదారి భద్రతులపై అవగాహన కల్పించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో రహదారి భద్రత పై పాటించాల్సిన అంశాలను వివరిస్తూ ప్రతిజ్ఞ చేయించారు.

## మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భాష



షేక్ బాషా

**ఎహిందూపురం జనవరి 31 ప్రభాతవార్త**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా హిందూపురానికి చెందిన షేక్ కట్ల భాష ను నియమిస్తూ ఆ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు ఇచ్చింది. నియోజకవర్గ ఇన్చార్జి దీపికా వేణు రెడ్డి సూచన మేరకు అధిష్టానం రాష్ట్రస్థాయి పదవిని కేటాయించింది. ఈ సందర్భంగా శనివారం ఆ పార్టీ కార్యాలయానికి వెళ్లి దీపిక వేణు రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు.

## బాలికల హాస్టల్ ను తనిఖీ చేసిన జడ్జీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి భాను

**కళ్యాణదుర్గం టౌన్, జనవరి 31, ప్రభాత వార్త**

కళ్యాణదుర్గం పట్టణం దొడగట్ట రోడ్డు నందు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ నంబర్ 2 ను జూనియర్ సివిల్ జడ్జి భాను శనివారం తనిఖీ చేశారు. బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు సక్రమంగా భోజనం అందుతుందా అని అధికారుల ఆరా తీశారు. అబ్దుల్ కలామ్ ను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ వివిధ రంగాల్లో రాణించాలని జడ్జి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రీటైనర్ లాయర్స్ పి తిమ్మప్ప చౌదరి, టీ దాదా ఖలందర్, టి రామాంజనేయులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## 7కోట్ల విలువైన పనులపై ప్రజా వేదిక

**అగళి, జనవరి 31 ప్రభాతవార్త**



వేదికపై మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ విజయ్‌ప్రసాద్

అగళి మండలంలో ఉపాధి హామీ పథకం కింద 2024 ఏప్రిల్ నుంచి 31 వ మార్చి - 2025 సంవత్సరాల్లో జరిగిన ఉపాధిహామీ పనులపై పంచాయితీల వారీగా సామాజిక తనిఖీ జరిగింది. డిఆర్‌పిలు అన్ని గ్రామ పంచాయితీల్లో జరిగిన పనులపై తనిఖీలు నిర్వహించారు. శనివారం మండల వ్యాప్తంగా జరిగిన పనులపై సామాజిక ప్రజా వేదిక ప్రాజెక్టు డైరెక్టర్ విజయ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ప్రజా వేదిక ఎంపిడిఓ కార్యాలయం ఆవరణంలో నిర్వహించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 790 పనులకుగాను రూ.6.63కోట్లు కూలీలకు డబ్బులు చెల్లించడం జరిగిందని, మెటీరియల్ పేమెంట్ కింద 92 లక్షలను ఖర్చు చేశారు. పండ్ల తోటల పెంపకం, బౌండరీ ట్రెంచులు, ఫీడర్ ఛానెల్ పనులు ఫారం పాండ్ల తవ్వకాలు, రైతుల పొలాలకు మట్టిరోడ్లు లాంటి పనులకు నిధులను ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఉపాధిహామీ, పంచాయితీ రాజ్ శాఖ సమన్వయంతో 55 సిసి రోడ్లకుగాను 2.75 కోట్లను ఖర్చు చేసినట్లు సామాజిక తనిఖీవారు తెలియజేశారు. గత నెల రోజులుగా చేసిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించి ప్రజా వేదికు సమాచారంతో వచ్చి ప్రజా వేదికలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, ఎంపిడిఓ గంగాధర్, ఏపిఓ మంజునాథ్, డిఆర్‌పిలు, ఎస్ఆర్‌పిలు, టిఎలు హాజరయ్యారు.

## 2న అనంతపురం వీకే మెమోరియల్ హాల్‌లో రాష్ట్ర సదస్సు

### - కరపత్రాలను విడుదల చేసిన సీపీఎం, అనుబంధ సంఘాలు - కష్టజీవుల పొట్టకొట్టె వీబీ జీ రాం జీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్



కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు

**ఉరవకొండ, జనవరి 31 ప్రభాతవార్త**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి కష్టజీవుల పొట్టలు కొట్టే వీబీ జీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 2వ తేదీన అనంతపురం నగరంలోని వీకే మెమోరియల్ హాల్‌లో రాష్ట్ర సదస్సు జరుగుతుందని కూలీలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.మధుసూదన్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.రంగారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాష్ట్ర సదస్సు కరపత్రాలను వారు సీపీఎం పార్టీ, అనుబంధ సంఘాల స్థానిక నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదస్సుకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, మహిళా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ వి.శివ నాగరాణి, రాష్ట్ర కమిటీ సభ్యులు, ఇతర ముఖ్య నాయకులు హాజరవుతున్నారన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం వచ్చిన తరువాత వ్యవసాయ కార్మికులకు పని లభించి వలసలు తగ్గాయని, అభివృద్ధి జరిగిందని, ఆత్మహత్యలు తగ్గాయని హార్టికల్చర్ హబ్ అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్రంలో 71 లక్షల మంది ఈ చట్టం ద్వారా లబ్ది పొందుతున్నారన్నారు. ఈ చట్టాన్ని ఎత్తివేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగింజి జీ రామ్ జీ అనే పేరుతో మార్పు చేసి కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉపాధి హామీ చట్టం పరిరక్షణకై అందరూ పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి వెంకటేశులు, రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దప్ప, నాయకులు రామాంజినేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## స్టెమి ఇంజక్షన్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలి

**గుత్తి, జనవరి 31 ప్రభాతవార్త**



వైద్యాధికారి మాట్లాడుతున్న దృశ్యం

నవమాజంలో ప్రస్తుతం ఉన్న ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ప్రజలు తమకు ఛాతిలో ఇబ్బంది రాగానే ప్రభుత్వాసుపత్రికి వెళ్లి తక్షణం వైద్య చికిత్సలు పొందాలని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప సూచించారు. స్థానిక వైద్యశాలలో శనివారం ఎలిమినేషన్ మెమో కార్డియాలిక్ ఇన్ ఫార్చెన్స్ అంశం పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు గుండె నొప్పి వస్తే తక్షణం ప్రభుత్వాసుపత్రికి రావాలని అక్కడ అయితే పరీక్షలు అనంతరం అవసరమైన వారికి 45 వేల రూపాయల విలువైన టెన్ క్రా ప్లెస్ ఇంజక్షన్ ఉచితంగా అందిస్తామన్నారు. రోగికి గోల్డెన్ అవర్‌గా భావించే ఈ సమయంలో ఇంజక్షన్ ఇవ్వడం వల్ల ప్రాణాపాయం తప్పుతుందని, తదుపరి ఉన్నత స్థాయిలో వైద్య చికిత్సలు పొంది తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని ఆయన సూచించారు. ప్రతినిత్యం మూడు ఇంజక్షన్లు అందుబాటులో ఉంటాయన్నారు. తమ ఫిజీషియన్ వైద్య బృందం ఎప్పుడు అందుబాటులో ఉంటూ రోగులకు వైద్య సేవలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో శింగనమల ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రోహినాథ్, డాక్టర్లు పవన్‌కుమార్‌రెడ్డి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన త్రిపుర ఐఏఎస్ అధికారి

**లేపాక్షి, జనవరి 31 ప్రభాతవార్త**



ఐఏఎస్ అధికారి సోనాల్‌గోయెల్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ప్రపంచ ప్రసిద్ధి చెందిన లేపాక్షి శ్రీదుర్గా పాపనాశేశ్వర వీరభద్రస్వామి దేవాలయాన్ని త్రిపుర రాష్ట్ర ఐఏఎస్ అధికారి సోనాల్‌గోయెల్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శిల్పాలు, తైలవర్ణచిత్రాల చరిత్రను తెలుసుకున్నారు. ఆలయంలోని ఏడు పడగల నాగేంద్రుడు, అసంపూర్తి కళ్యాణమండపం, నాట్యమండపంలోని శిల్పాలు, తైలవర్ణ చిత్రాలు, వేలాడే స్తంభాన్ని చూసి ఆశ్చర్యపోయారు. అనంతరం దుర్గాదేవి వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మర్యాదలతో ఐఏఎస్ అధికారి సోనాల్‌గోయెల్‌ను తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, ఆలయ ఈఓ నరసింహమూర్తి ఘనంగా సత్కరించారు. అనంతరం లేపాక్షి ఏకశిలా నందిని ఐఏఎస్ అధికారి సోనాల్‌గోయెల్ సందర్శించారు.

## సిరివరంలో జ్యోతుల ఉత్సవం

**లేపాక్షి, జనవరి 31 ప్రభాతవార్త**



జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న దృశ్యం

మండల పరిధిలోని సిరివరం గ్రామంలో వెలసిన శ్రీకోడి రంగనాథస్వామికి మహిళలు శనివారం జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. శ్రీకోడి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఆలయ ట్రస్టి రామచంద్రారావు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గ్రామంలో ఇంటి నుండి మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన జ్యోతులను గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి జ్యోతులను అర్పించారు. ఈ సందర్భంగా మహిళలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

